



## కాకులు

[రచయిత: పురాణం సూర్యప్రకాశరావు. జీవన గంగా ప్రచురణలు, విజయవాడ — 3. వెల: రు. 3—00.]

ఈ కథల సంపుటిలో ఆరు కథలున్నాయి. మొదటి కథ 'మూడువేల ఐదు వందలు'. ఇది ఒక యువకుడు పుచ్చుకున్న పెళ్ళి కట్నం. యువకుడు ఉన్నతాదర్శాలు కలవాడు. మనం అశక్త దుర్జనులను గురించి వింటాం. ఇతను అశక్త సజ్జనుడు. అందం చూడగూడదు; కట్నం తీసుకోరాదు; భార్యను పోషించదగిన స్థితిలోనే పెళ్ళాడాలి — ఇవి అతని ఆశయాలు. ఈ ఆశయాలు పరిస్థితుల వేడికి ఇగిరిపోతాయి. తల్లికి ఆడతోడు కావాలి. తండ్రికి కట్నం కావాలి. అందమైన పిల్లే దొరుకుతుంది. పెళ్ళితో పిల్లలు పుడతారు. ఖర్చు పెరుగుతుంది. రాబడి పెరగనందున అప్పు పెరుగుతుంది. మామగారు దివాలా ఎత్తేసి దిక్కుమాలిన చావు చస్తాడు. మామగారికి ఆ మూడు వేల ఐదువందలూ తిరిగి ఎప్పటికైనా ఇచ్చెయ్యాలన్నది గొంతెమ్మ కోరికలాగే నిలిచిపోయింది. చూస్తూండగానే కూతురికి కట్నంతోసహా పెళ్ళిచెయ్యవలసిన రోజు ప్రతిధ్వనిలాగా వచ్చి పడుతుంది.

'తాత,' 'తాతయ్య సురిసెం' అన్న కథలు స్కెచెస్. చిన్నతరంవాళ్ళని "పాడు" చెయ్యడం, పైతరం వాళ్ళ తమకు తగిన మర్యాదలు చూపటం లేదని ఆగ్రహించటం వార్ధక్య లక్షణాలు. వార్ధక్య లక్షణాలు రెండు కథలలోని తాతయ్యలలోనూ ఉన్నాయి. ఇద్దరూ సుబ్బయ్యతాతలే. కాని ఇద్దరూ ఒకరుకాదు. ఒకరు కాకపోయినా, అన్నదమ్ము లనిపించుకోదగిన వాళ్ళే.

రెండో కథలో ఉన్న సుబ్బయ్యతాత కథకుడికి ఏ విధంగా తాతో తెలియ లేదు. ఆయన కున్నదే ఒక్క కొడుకు. వాడి కింకా పెళ్ళి లేదు. ఈ సుబ్బయ్యతాత తన కొడుకును ఎంతగా ... వేశాడంటే, తనకన్న చిన్నవాళ్ళు ఉద్యోగం చేస్తున్నా వాడికి వీథిబడి చదువు రాలేదు. పిల్లల్ని అచ్చగా సురిసెంతో ఇంత శుంఠలుగా చెయ్యటం సాధ్యంకాదు. చాలా చిన్నతనంలోనే చదువంటే భయమూ, అసహ్యమూ అలవరచుకున్నవాళ్ళ అలా తయారుకావచ్చు. కొంతమందికి జన్మతః చదు వంటకపోవటం కూడా ఉండవచ్చు. సూర్యానికి చదువుకోవాలని ఉన్నది. అలాంటి వాడు తండ్రి గారాంతో పూర్తిగా శుంఠ అయిపోవటం అనుమానాస్పదం.

'పిడ్కోలు' చిన్న కథ. చక్కని కథ. గంభీరమైన కథ. జరగవి కథ. ఒక యుక్తవయస్కురాలు చనిపోయింది. ఆమెను పోసేసివాక, పొరుగింటి యువకుడికి, ఆమె తనను ప్రేమించినట్టు ఒకటి రెండు దాఖలాలు కనబడతాయి. ఇనపతెరలకోసం కమ్యూనిస్టు దేశాల పొలిమేరలు వెతకక్కరలేదు. అవి మన మధ్యనే ఉన్నాయి. మనది మూగ జీవితం అనటానికి సందేహం లేదు.

'పట్టు తెరలు' అయ్యవారి వట్టింటికి పట్టు తెరలు. ఇది కూడా పాత్ర చిత్రణ ప్రధానంగాగల కథే. స్కెచ్ లాటిది. ఇందులో ఒక వితంతువు గంజి నీళ్లకు కూడా ఉండీ లేని స్థితిలో తన దారిద్ర్యాన్ని ఒకరికి తెలియనివ్వకుండా, ఒకరిమీద ఆధార పడకుండా, అయినవాళ్లను కూడా ఆమడదూరంలో ఉంచి తన జీవితాన్ని కొనసాగించుకొస్తుంది. మధ్య తరగతి మనస్తత్వానికి కటిక దారిద్ర్యం అడ్డురాదు. ఆ మనస్తత్వం అర్థంలేని వ్యక్తివాదం మీదా, సంఘానికి వెలిగా బతకటంలోనూ ఉంటుంది. ఈ పాత్ర ఎల్ల రచయితకు సానుభూతి ఉన్నట్లు కనిపిస్తుంది. ఆ సానుభూతి సమర్థనీయం కాదు. ఏ సంఘ వ్యతిరేకి పట్లా సానుభూతి తగదు.

'కాకులు' అన్న కథలో కాకులైతే ఉన్నాయిగాని, అసలైన కాకులు లోకులు; భర్త పోయి బతుకు శూన్యమైపోయిన ఒక అనాథకు కాస్త ఆధారం దొరికేటట్టు కనబడితే! దాన్ని ఆమెకు అందకుండా తన్నేస్తారు. అసలు కాకులు మంచివి. అవి ఒకరి చేతినించి తన్నేసినదాన్ని తామైనా అనుభవిస్తాయి. మనిషి కాకులు ఒకరిని తిననివ్వవు, తాము తినవు.

మనిషికాకుల మనస్తత్వం, 'మూడు వేల ఐదువందలు' అన్న కథలోనే మనకు కొంత తెలుస్తుంది. మనిషికాకి మితవాది అయితే మూడువేల అయిదు వందల కట్నం తీసుకునేటందుకు అభ్యంతరం చెప్పదుగాని, "అంతకంటే ఎక్కువ కట్నాపేక్ష మనకుండకూడదు" అంటుంది. ఈ మనిషికాకులు "బొత్తిగా మూర్ఖులు. ప్రపంచాన్నంతా తమ దృష్టితోనే కొలుస్తారు. అంతా తమలాంటి అభిప్రాయాలే కలిగి ఉంటారని భావిస్తారు. అదే అభిప్రాయాన్ని ఎదుటివాళ్ళకి నీతులు చెప్పటానికి ప్రయత్నిస్తారు... వాళ్ళ చేసే పన్లన్నీ వాళ్ల దృష్టిలో ఘనకార్యాల్లాగానే కనిపిస్తాయి."

ఈ కథకుడి కథనంలోగాని, శైలిలోగాని ఎలాటి వికారాలూ లేవు. ఇవి పతితను చొక్కాపట్టి నిలపవు. డొక్కల్లో పొడవవు. పాఠకుడి లెవెల్లో మాట్లాడతాయి. సామాన్య జీవితాన్ని సమర్థతతో చిత్రించే నేర్పు ఈ కథలలో కనిపిస్తుంది. జీవితాన్ని ఇంకా కొంచెం లోతుగా మథించినట్టయితే ఈ కథలను అగ్రస్థానంలో ఉంచటానికి ఎలాటి అభ్యంతరమూ ఉండకపోను.

— కొ. కు.

Printed and Published on behalf of Andhra Prabha Private Ltd., by M. KRISHNASWAMI, B.A. B.L., at the Dinamani Press, Express Estates, M a d r a s - 2. Editor: P. NAGESWARARAO.

## స్పందన

[కవితా సంకలనం. స్పందన సాహితి నిర్వహణ. ప్రతులకు: స్పందన సాహితి, 1—8—172, చిక్కడపల్లి, హైదరాబాదు—20. డెమ్మీ 80 పుటలు. వెల: రు. 1—00.]

నవ్య కవులు రచించిన 47 కవితల సంకలనం ఇది. దీనికి స్వాగతమిస్తూ నవ్య కవులలో పేరుపడిన శ్రీ కుందుర్తి నవ్య కవితా వైశిష్ట్యాన్ని, ఆవశ్యకతనూ చక్కగా వివరించారు. తాతలు ఇచ్చిపోయిన పొలంలో ఎక్కువ దిగుబడి వచ్చే మేలురకం పంట లాంటిది నవ్య కవిత అనీ, ప్రాచ్య కవిత కంటె ఎంతో మేలయినదనీ తెలియజేశారు. ప్రాచీన కావ్యాలు చదివితే చదువవచ్చునని అనుమతి నిచ్చారు. ఇందులోని రచనలు అభ్యుదయ కవులకు ప్రోత్సాహం ఇచ్చేవిగా ఉన్నవి. రచయితలు — ఇందులో — తమవద్ద తగినంత కవితా సామగ్రి ఉన్నదని ఋజువు చేసుకున్నారని తృప్తిని వెల్లడించారు. క్రొత్తవారికి స్థానం ఇచ్చినందుకు గర్విస్తున్నట్లు స్పందన సాహితివారు వెల్లడించారు.

'స్పందన' శీర్షికలో వరవరరావుగారు నవ్యకవితా లక్షణాన్ని వివరిస్తూ, ఇవ్వాళటి కావ్యానికి ఛందస్సు — ఉద్యమం; కవి సమయం — తిరుగుబాటు; విప్లవం ఈనాటి కావ్యానికి 'స్పందన' అని స్పష్టంగా చెప్పారు. పద్దెనిమిది పర్వాల భారతం నిన్న గొప్పదైతే పద్దెనిమిది పంక్తుల గేయం నేడు గొప్పదని ఒక అభ్యుదయ కవి చెప్పుకుంటున్నాడు. వేలకొద్దీ సంవత్సరాలపాటు అప్పటి రచనలు నిలిచినట్లుగా ఇప్పటి గేయాలు కొన్ని దశాబ్దాల పాటు నిలిచి ఉన్నా సంతోషమే!

అన్నీ కాకపోయినా కొన్నయినా ఇందులో మంచి కవిత లున్నాయి. రచనలకు అడుగున — స్థలం ఉన్న చోట—అభ్యుదయ కవుల్లో పేరుపడినవారి సూక్తులు చేర్చబడ్డాయి.

మహాత్ముని శతజయంతి సందర్భంగా వెలువడిన ఈ కవితాంజలిలో కొన్ని మహాత్ముని మహదాశయాలనూ, ఆ ఆశయా లిప్పుడు పనిచేస్తున్న తీరునూ కళ్లకు కట్టినట్లు వివరించాయి.

కవిత్వం మూలంగా దేశాన్ని ఉభ్యుదయ మార్గానికి తీసుకురావడం రచయితల లక్ష్యమై ఉండాలి. ఆది ఏ మాత్రం నెరవేరినా అందరమూ ఎంతో ఆనందించవలసిందే!

— ఆయాస్య

**చైతన్య జ్యోతి** (నాటిక) రచన: గొట్టిముక్కల నాగేశ్వరరావు. ప్రచురణ: విజయదుర్గా పబ్లికేషన్స్, మల్లికార్జునపేట, విజయవాడ—1. వెల: రు. 1—25.

* * *

**ప్రేమకు చావులేదు** (నాటిక) రచన: ఎస్. ఎస్. ఎస్. సుందరం. ప్రచురణ: కాళహస్తి తమ్మారావు అండ్ సన్స్, రాజమండ్రి. వెల: రు. 1—00.